ChimataMusic.com
Patha Patala Parnasala

# గానగంధర్వుడు

"నాడు ఏ తల్లి మొదటి కబళం నా జోలెలో వేసిందో ఆమె వాత్సల్యపూరితమైన భిక్ష నాకు అష్టైశ్వర్యాలు కూడిన భవిష్యత్తునే ప్రసాదించింది"

- ఘంటసాల

ఎవరో కానీ ఆ మహాతల్లికి యావదాంధ్రదేశం ఋణపడి ఉంది!

డిసెంబర్ 4, 1922న ఒక గంధర్వ అంశం ఆంధ్రదేశం లోని ఒక మారుమూల గ్రామం చౌటుపల్లిలో శ్రీ ఘంటసాల సూరయ్య, రత్తమ్మ దంపతుల ఇంట వెంకటేశ్వరుని నామధేయంతో ఉదయించింది.

విజయనగర సంగీత కళాశాలలో సంగీత పట్టభద్రుడై తన 22వ ఏట చెన్నపురికి చేరిన ఘంటసాలను అదే ఇంటి పేరున్న నిర్మాత బలరామయ్యగారి బంధువని చాలా మంది భావించారు. బలరామయ్యగారు నిర్మించిన 'సీతారామజననం' అక్కినేని మొదటి చిత్రం. విశేషమేమిటంటే ఘంటసాల గారి మొదటి చిత్రం కూడా అదే. అందులో ఒక చిన్న వేషంతో పాటు ఒక పాటలో కోరస్‌లో గొంతు కలిపారు. అక్కినేనితో ఘంటసాల గారి అనుబంధం అక్కడితో ఆగిపోలేదు. ఆయన గాత్ర ప్రస్థానంలో మొదటి సహగాయని భానుమతి అయితే, మొదటి సహగాయకుడు అక్కినేని.

గాయకుడిగా ఆయన మొదటి పాట "ఓ నా రాజ" చిత్రం 'స్వర్గసీమ', చివరగా రికార్డ్ అయిన పాట "చక్కని వాడే. భలే టక్కరివాడే" చిత్రం 'యశోదకృష్ణ'. ఘంటసాల పాటలతో విడుదలైన చివరి చిత్రం 'మా ఇంటి దేవత'.

ఘంటసాల గురించి రాయడమంటే తెలుగు సినీ సంగీతం గురించి రాయడమే కదా. మన పోతన గారన్నట్లు "విబుధ జనులనుండి విన్నంత కన్నంత" అని నాకు తెలిసిన కొన్ని విషయాలను మీతో పంచుకుంటున్నాను.

ఘంటసాల గురించి వ్రాయాలంటే చాలా సులభం అనుకున్నాను నిన్నటి దాకా, కానీ మొదలుపెట్టాక తెలిసింది ఎంత కష్టం అని! ఆయన పాడిన తీరు గురించి వ్రాద్దాము అంటే నాకు సంగీత జ్ఞానం లేదు, పోనీ వర్ణిద్దాము అంటే తెలుగు, హిందీ, కన్నడ, ఇంగ్లీషు భాషలలో నాకు తెలిసిన విశేషణాలు చాలవు.

ఎలా వ్రాయడం, వ్రాయలేను వదిలేద్దామా అనిపించింది. కానీ ఆ మహానుభావుడిని గుర్తు చేసుకోకుండా ఉండలేము కదా, అందుకే నాకు తెలిసిన ఆయన పాటలన్నీ ఒక్కసారి నెమరు వేద్దాము అనుకున్నాను. కానీ దాదాపుగా 1500 పాటలు నెమరువెయ్యడము కూడా కష్టం. అందుకే ఈ వ్యాసాన్ని మూడు భాగాలలో వ్రాస్తే మంచిదని అనిపించింది.

మొదటి భాగం లో ఆయన 1944-1959 వరకు పాడిన చిత్రాలనుండి కొన్ని పాటలను మనము తిరిగి గుర్తుకు తెచ్చుకుంటే అంతకంటే నివాళి వేరే లేదేమో అనిపించింది.

కాబట్టి మొదటి భాగము లో నేను 1944-59 వరకు ఆయన పాడిన పాటలు, రెండవ భాగంలో 1959-74 వరకు పాడిన పాటలు, మూడవ భాగంలో **with a spl reference to his Music direction** అని అనుకున్నాను.

ఇక ప్రారంభిద్దామా....

నేపధ్యగాయకుడిగా ఘంటసాల ప్రస్థానం (1944 'సీతారామజననం' కోరస్ కలుపుకుంటే) 1945 లో విడుదలైన నాగయ్య గారి సంగీత సారధ్యంలో "ఓహో నా రాజా" అనే భానుమతి తో కలిసి పాడిన పాట. అప్పటికే సినీ పరిశ్రమలో నాగయ్య, ఎమ్మెస్. రామారావు, పి. సూరిబాబు, గోవిందరాజం లాంటి మహామహులు ఉన్నారు. ఘంటసాల గాత్రంలోని నాద బద్దత, శృతి బద్దత ఆయన్ను అతి తక్కువ సమయంలో అగ్రస్థానానికి తీసుకెళ్ళాయి.

ఘంటసాల గారి మొదటి సూపర్ హిట్ పాటగా 'బాలరాజు' (1949) లోని "చెలియ కనరావ ఇక" గా పేర్కొనవచ్చు. విశేషమేమిటంటే అంత వరకు నటగాయకుడిగా ఉన్న ANR ఈ పాటతో తన గాయక అవతారానికి స్వస్తి చెప్పి నటుడిగా స్థిరపడిపోయారు. ఈ పాట మొదట అక్కినేని గొంతులో రికార్డ్ అయ్యి పిదప ఘంటసాల గారి గొంతుతో సినిమాలో విడుదల అయ్యింది.

1949 లో విడుదలైన 'లైలా మజ్ను' చిత్రంలో మొదటిసారి ఘంటసాల పేరు నేపధ్యగాయకుడిగా కనపడినది (అంతవరకు చిత్రంలో నటుల పేర్లే రికార్డ్స్ గా వచ్చేవి). ఆ సంవత్సరం ఘంటసాల పాడిన 7 చిత్రాలలో 5 సూపర్‌హిట్. అవి 'ద్రోహి' (పెండ్యాల మొదటి చిత్రం), 'కీలుగుర్రం', 'రక్తరేఖ', 'లైలామజ్ను', 'ధర్మాంగద', 'మన దేశం' (NTR మొదటి చిత్రం) మరియు 'గుణసుందరి కథ'.

1951 లో విడుదలైన 'పాతాళభైరవి' తెలుగు చిత్రరంగానికి చెందిన ఎంతో మందిని ఒక్కసారిగ స్టార్స్‌గా

మార్చేసింది. NTR, ANR, బాలకృష్ణ లే కాక ఒక చిన్న సన్నివేశంలో సావిత్రి కూడా కనిపిస్తుంది, తెరముందు స్టార్స్‌గా వీరు కనిపిస్తే తెర వెనుక స్టార్స్‌గా నాగిరెడ్డి, చక్రపాణి మరియు ఘంటసాల గార్లు తిరుగు లేని స్థానాన్ని సంపాదించారు.

బాణీ పరంగా, జనప్రియత పరంగా 'పాతాళభైరవి' ఉర్రూతలూగిస్తే, పనిచేసిన ప్రతి ఒక్కరికీ అజరామరమైన కీర్తిని మిగిల్చిన చిత్రం 'మల్లీశ్వరి'. బి. ఎన్. రెడ్డి, దేవులపల్లి, ఎస్. రాజేశ్వర రావు , ఘంటసాల మరియు భానుమతిలు కలసి, ఈ సినిమాను తెలుగు చిత్రసీమలో మొట్టమొదటి సంగీత కళాఖండంగా మలిచారు. అందులో ఘంటసాల పాడింది కేవలం మూడు పాటలే కానీ మూడూ మూడు వైవిధ్యమైన అనర్ఘ్య రత్నాలు. "పరుగులు తీయాలి" అలా అలా మనలను పరిగెత్తిస్తే, "ఆకాశ వీధిలో" మనసును ఎక్కడో విహరింపజేస్తే, ఇక "ఔనా నిజమేనా" ఘంటసాల అతి తక్కువ స్థాయిలో (low note) న భూతో న భవిష్యతిగా, అనితరసాధ్యంగా గానం చేసి ప్రాణం పోశారు. (వ్యక్తిగతంగా నాకు ఘంటసాల పాటలలో అత్యంత ఇష్టమైన పాటలలో ఇది ఒకటి)

1952 లో విడుదలైన మూడు చిత్రాలు ఘంటసాల గాత్ర వైవిధ్యాన్ని (నేటి భాషలో రేంజ్) ప్రజలకు పరిచయం చేశాయి. అవి 'పెళ్ళిచేసి చూడు', 'టింగురంగ' మరియు 'పల్లెటూరు'. పెళ్ళికాని, పెళ్ళిచేసుకోబోయే ప్రతీ తెలుగువాడి నోటా పలికిన పాట "ఓ భావి భారత భాగ్య విధాతల్లారా - పెళ్ళి చేసుకుని ఇల్లు కట్టుకుని". అలాగే 'పల్లెటూరు' లోని శ్రీశ్రీ రచన "పొలాలనన్నీ హలాల దున్ని" ఎంతో మంది రైతాంగం పాడుకొన్న పాట. అదే చిత్రంలోని "చేయెత్తి జైకొట్టు తెలుగోడా" తెలుగువారి మీద వచ్చిన అతి కొద్ది పాటలలో మొదటిది. ఇకపోతే అంతగా విజయవంతం కాలేకపోయినా 'టింగురంగ' అనే చిత్రంలో సుద్ద శాస్త్రీయమైన బాణీలను అతి సమర్ధవంతంగా గానం చేశారు మాస్టారు. ఒక్కసారి "రాజా మహరాజా" అన్న పాట వినండి అది ఏ కర్ణాటక సంగీత వాగ్గేయకారుడో పాడినట్లు ఉంటుంది.

1953 - 'దేవదాసు' - దేవదాసు పాటల గురించి రాయడమా - అమ్మో!!!!!!!!!

ఇక్కడ ఒక్క విషయం మాత్రం గుర్తు చేసుకోవాలి. ఈ సినిమా పాటల రికార్డింగ్ సమయానికి, ఈ చిత్ర సంగీతదర్శకుడు సుబ్బరామన్ గారికి, ఘంటసాల గారికి ఏదో చిన్న అపోహ కారణంగా, మొదట పాటలు పాడటానికి ఎ.ఎం. రాజా ని ఎంచుకున్నారంట. కానీ సుబ్బరామన్ గారికి రాజా పాట ఆ చిత్రానికి నప్పలేదనిపించి, మనస్పర్ధలు పక్కన పెట్టి, స్వయముగా ఘంటసాల గారికి ఫోన్ చేసి, 'ఈ సినిమాలో పాటలు నువ్వే పాడాలిరా' అని పిలిపించుకుని పాడించారంట. ఇదే కనుక జరుగక పోయినట్లైతే!!!

1953 నుండి ఆయన గాత్రానికి తెలుగులోనే కాదు, అటు తమిళంలో, ఇటు కన్నడంలో కూడా

తిరుగులేకుండా పోయింది. ఆ స్వర ప్రస్థానంలోని కొన్ని పాటలను అతి టూకీగా గుర్తుకు తెచ్చుకుందామా..

'సంతానం' (1955)- అంటే గుర్తుకు వచ్చేది మాస్టారు పాడిన 2 పాటలు "దేవీ శ్రీదేవి", "చల్లని వెన్నెలలో" మరియు విశ్వవిఖ్యాత గాయని లత పాడిన "నిదురపోరా తమ్ముడా". దక్షిణామూర్తి సంగీత దక్షతకు నిదర్శనగా ఘంటసాల పాడిన "చల్లని వెన్నెల" పాట నేటికీ కళ్యాణి రాగం అంటే మొదటగా గుర్తుకు వచ్చే పాటగా మిగిలిపోయింది. అందులో ఆయన గొంతు "నాలో లీనమాయెనే" అనే చోట వినండి, మార్దవం అనే గుణం ఎలావుంటుంది అని తెలుస్తుంది!

'తెనాలి రామకృష్ణ' (1956)- ఈ చినిమాలో పాటలు వినడానికి బాగున్నా, మొదట పద్యాలు వినండి. ముఖ్యంగా "మేకతోకకు తోకమేకకు", "త్రువ్వట బాబా", "హా తెలిసెన్ భువనైక". తెలుగువారికే సొంతమైన పద్యాలను ఇంత మధురంగా వేరెవ్వరు పాడలేరేమో! యావదాంధ్ర తెలుగు ప్రజానీకానికి నా విన్నపం - మీ పిల్లలకు దయచేసి ఈ పద్యాలను వినిపించి నేర్పించండి. నేడు మార్కెట్లో దొరికే animated పద్యాలను నేర్పకండి. వాటినుండి భావదారిద్ర్యం, భాషా దరిద్రం తప్ప ఇంకేమీ దొరకవు.

'చిరంజీవులు' (1956)- తెలుగుపాటకు మేస్త్రి - మల్లాది శాస్త్రి అనిపించుకున్న మల్లాది రామకృష్ణ శాస్త్రి అజరామరమైన కవితా సోయగం ఈ చిత్రంలో ఘంటసాల గొంతులో మరెన్నో సోయగాలు పోయింది. కళ్ళు మూసుకుని నేటి ప్రపంచంలోని - 'సారీ, థాంక్స్, బికాజ్, బేసికల్లీ, ఎక్స్‌క్యూజ్ మీ' లాంటి విదేశీ పదాలన్నీ మర్చిపోయి - "చికిలింత చిగురు, సంపంగి గుబురు" పాట వినండి, మన తెలుగు ఇంత తీయగా ఉందా అనిపించకపోతే ఒట్టు! ఇకపోతే ఈ చిత్రంలోని మరో రెండు పాటలను ప్రస్తావించకపోతే ఆ చిత్ర సంగీతానికే అవమానం. అవి "మిగిలింది నేనా" మరియు "కనుపాప కరువైన కనులెందుకు". కేవలం కనుపాప కరువైన పాట గురించే ఒక వ్యాసం రాయొచ్చు.

'తోడికోడళ్ళు' (1956)- ఆత్రేయనా? శ్రీశ్రీనా? అని నేటికీ ప్రజలు వాదించుకునే "కారులో షికారుకెళ్ళే" పాటలోని ఘంటసాల గాత్రానికి, అక్కినేని సాత్వికాభినయానికి హర్షించని వ్యక్తి లేడంటే అతిశయోక్తి కాదేమో. అదే చిత్రంలోని "ఆడుతు పాడుతు పనిచేస్తుంటే అలుపూ సొలుపేమున్నది" నేటికీ పండగలు, పబ్బాలు వస్తే అందరూ కలిసి పాడుకునే పాట.

1957- ఘంటసాల సామాన్య మానవుడు కాదు, సాక్షాత్తూ గంధర్వుడే అని అందరూ ఏక కంఠంతో ఒప్పుకునే పాటలు వినిపించిన సంవత్సరం. 'మాయాబజార్', 'వినాయక చవితి', 'సువర్ణ సుందరి', 'పాండురంగ మహత్యం' ఈ సంవత్సరంలో ఘంటసాల గాత్ర వైభవాన్ని చాటి చెప్పిన చిత్రాలు.

"లాహిరి లాహిరి లాహిరిలో" ఆయన చేసిన గమ్మత్తులు, "సుందరి నీవంటి దివ్యస్వరూపము" లో ఆయన చూపిన వైవిధ్యత, "చూపులు కలిసిన శుభవేళ" లో ఆయన గళంలోని హొయలు వర్ణించనలవి కాదు.

ఇక 'వినాయక చవితి' లోని "వాతాపి గణపతింబజే" పాట విన్న తరువాత ఎందరో కర్ణాటక సంగీత విద్వాంసులు, ఆ పాట పాడి ఇక ప్రజలను మెప్పించడం కష్టం అని ఒప్పుకున్నారు. ఎన్నో సంవత్సరాలు (ఈ multiplex సంప్రదాయం రాకముందు) థియేటర్లలో morning show ప్రారంభానికి ముందు, బుకింగ్ ప్రారంభం అయిన తరువాత ఈ పాట వేసేవారు.

"హే కృష్ణా ముకుందా మురారీ" - 'పాండురంగ మహత్యం' - కళ్ళు మూసుకోండి, ఈ పాట మధ్యలో వచ్చే "కస్తూరీ తిలకం" శ్లోకం వినండి- తాద్యాత్మత అంటే ఏమిటో అర్ధం అవుతుంది.

"దేవ దేవ ధవళాచల మందిరా గంగాధరా హరా నమో నమో"
"నీలకంధరా దేవా దీనబాంధవా"
తెలుగు భాషలో నాగభూషణుడిపైన ఇంతకన్నా అద్భుతమైన పాటలు వేరే లేవు. ఇవి మాస్టారు 'భూకైలాశ్' లో అత్యంత భక్తి భావంతో గానం చేశారు. సినిమా పాటలు దేవస్థానంలో చోటుచేసుకునే అదృష్టం కలిగిన అతికొద్ది పాటలలో ఇవి రెండు!

'చెంచు లక్ష్మి' (1958)- అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది సుశీల హృద్యంగా గానం చేసిన "పాలకడలిపై శేషతల్పమున", మరియు ఘంటసాల, జిక్కి పాడిన "చెట్టులెక్కగలవా ఓ నరహరి". అదే చిత్రంలోని "కరుణాలవాల ఇది నీదు లీల" కరుణారస పూరిత నారద స్తోత్రం మాస్టారి గాత్రంలో ఎంతో ప్రజాదరణ పొందింది. కానీ అంతగా జనాదరణకు నోచుకోని ఒక అద్భుతమైన పాట ఘంటసాల లీలతో పాడిన "ఆనందమాయే అల నీలవేణి" నాకిష్టమైన పాటలలో ఒకటి. చాల హాయిగా మంద్ర స్థాయిలో సాగుతూ తేలుతూ ఉంటుంది ఈ పాట.

'మంచిమనసుకు మంచిరోజులు' (1958)- "రావే నా చెలియ" మనసుకు హత్తుకునే హృద్యమైన పాట అయితే, "కలవారి స్వార్థం" ఘంటసాల గళంలో అవేదనాభరితంగా జాలువారింది.

'పెళ్ళినాటి ప్రమాణాలు' (1958)- "చల్లగ చూడాలి.. పూలను అందుకుపోవాలి" ఘంటసాల గాత్రమాధుర్యం, పింగళి రచనా వైధూర్యం కలబోసిన కమ్మని పాట అయితే, లీలతో మాస్టారు అల్లరిగా,

చిలిపిగా చలాకీగా పాడిన పాట "వెన్నెల లోనే వేడి ఏలనో".

1959-

"ఆకాశ వీధిలో అందాల జాబిలి"

"వాడిన పూలే వికసించెలే"

"పెను చీకటాయే లోకం"

అన్నీ అద్భుతమైన సాహిత్యానికి పెద్ద పీట వేసే అన్నపూర్ణ వారి 'మాంగల్యబలం' లోని శ్రీశ్రీ గీతాలు. యుగళగీతం అంటే అది ఘంటసాల సుశీల పాడితేనే అంటారు అని ఆంధ్రదేశం మొత్తం ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు ఈ చిత్రం విడుదలైన తరువాత! సుశీల కూడా ఈ చిత్రం తరువాత చిత్రసీమలో అగ్రస్థానానికి చేరుకుంది.

"హృదయమెల్ల హాయిగా.. తీయగా.. పరవశింప చేయగ.. ఎచటి నుండి వీచెనో ఈ చల్లని గాలి" సాయంత్రం చల్లని గాలి మనకు తాకితే ఈ పాట గుర్తుకు రాక ఉంటుందా!? అంత హాయిగా, తీయగా పాడారు ఘంటసాల, లీల.

"అప్పుచేసి పప్పుకూడు తినరా"

"కాశీకి పోయాను రామాహరే గంగ తీర్థమ్ము తెచ్చాను" పాటలు, హాస్య గీతాలు పాడటం తక్కువైనా మక్కువగా పాడారు ఘంటసాల గారు. 'అప్పుచేసి పప్పుకూడు' లోని పై పాటలన్నీ హాయిగొలిపే పాటలు.

అయితే, అదే సంవత్సరంలో తెలుగు సినీ సంగీత చరిత్రలో పునరావృతం కాదు అనిపించే సంగీతం వినిపించింది మాస్టారి గళంలో.. 'జయభేరి' చిత్రంలో! మల్లాది, పెండ్యాల, పి. పుల్లయ్య, ఘంటసాల కలిపి చిలికిన సంగీత దధి ఈ చిత్ర సంగీత నిధి.

"రాగమయీ రావే.. అనురాగమయీ రావే" ఘంటసాల పాడిన 'All time Top Ten' అని ఎవరన్నా సంకలనం చేస్తే మొదటి వరసలో ఉండే పాట. ఇక తెలుగు సినీ పాటను ఒక సిసలైన గంధర్వుడు పాడితే ఎలా వుంటుందో అని పెండ్యాల రెండు సార్లు నిరూపించారు. అందులో ఒకటి 'జయభేరి' లోని "రసిక రాజ తగువారము కామా". దీనికి ఘంటసాల గారు 10 రోజులు రిహార్సల్స్ చేశారని అంటారు!

1960 లోపు వచ్చిన తెలుగు సినిమాలలో అత్యంత ప్రజాదరణ పొందిన సామాజిక చిత్రం ఏదంటే అది నిస్సందేహంగా 'ఇల్లరికం' (1959) అని చెప్పవచ్చు. కేవలం పాటలవల్లే ఆ చిత్రం ఆయుష్షు ఒక 15

వారాలు పెరిగిందంటే అది అతిశయోక్తి కానే కాదు.

"యూ తో హమ్నే లా హసీనా దేఖా హై తుం సా నహీ దేఖా" అనేది రఫీ పాడిన అత్యంత ప్రజాదరణ పొందిన గీతం. దాన్ని చలపతిరావు తెలుగులో రీట్యూన్ చేయగా రఫీ కు భిన్నంగా, అంటే తీయగా పాడారు ఘంటసాలగారు. ఆ పాటే "ఎక్కడి దొంగలు అక్కడనే గప్ చిప్". ఇక విడుదలై 38 యేళ్ళు అయినా ఇప్పటికీ కాలేజీ కుర్రకారుకి వెర్రెక్కించే పాట "నిలువవే వాలు కనుల దానా". ఈ చిత్రం సూపర్ హిట్ కావడానికి CSR ఎంత ముఖ్యకారకులో ఘంటసాల-చలపతిరావు కాంబినేషన్ అంతే ముఖ్యకారణం.

ఇక ఈ భాగం ముగించేముందు 1959 చివరన వచ్చిన, తెలుగులో అత్యంత ఉత్తేజపూరితమైన గీతాలలో ఒకటి 'శభాష్ రాముడు' చిత్రంలోని "జయమ్ము నిశ్చయమ్మురా". ప్రతీ రిక్షావానికీ అత్యంత ప్రీతి పాత్రమైనది ఈ పాట. ఎంతో భావగాంభీర్యంతో ఈ పాట పాడారు మాస్టారు.

ఇంతటితో ఘంటసాల గారి 30 సంవత్సరాల గాయక జీవితంలోని మొదటి సగభాగం గుర్తుకు తెచ్చుకున్నాము. మిగిలిన సగభాగం తరువాత చర్చించుకుందామా....

మీ

**నందకిశోర్**

*(ఎంతో సమయం వెచ్చించి, శ్రమ కూర్చి ఈ ఆర్టికల్‌ని ఎడిట్ చేసిన సూర్య గూడూరు గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు - నందకిశోర్)*

**<u>రచయిత గురించి:</u>**

స్వగ్రామం: ఆదోని (కర్నూలు జిల్లా); వృత్తి: కెనరా బ్యాంక్‌లో Software Implementing Officer, బెంగుళూరు.

సంగీత, సాహిత్యాలతో ప్రగాఢమైన అనుబంధం ఉన్న నందకిశోర్ గారికి సాహిత్యపు విలువలున్న ప్రతీ పాట ఇష్టమే! తనకి ఎంతో స్థైర్యాన్ని ఇచ్చిన "ఎక్కడ ఉన్నా ఏమైనా (మురళీకృష్ణ)", "ఎప్పుడూ కోరుకోవద్దురా ఓటమి (పట్టుదల)" లాంటి పాటలకు మాత్రం ప్రత్యేక స్థానం ఇస్తారు. బాలు పాటలంటే ప్రాణమిచ్చినా సైగల్, తలత్ మెహమూద్, రఫీ, కిషోర్ కుమార్ వంటి హిందీ గాయకుల; ఘంటసాల, సుశీల, జానకి వంటి తెలుగు గాయకుల పాటలను కూడా అంతే ఆసక్తితో వింటారు. కొందరు నటులు (కృష్ణ, దేవానంద్) కేవలం పాటల వల్లనే అభిమాన నటులయ్యారంటే అతిశయోక్తి కాదు. అలనాటి పాటల

రచయితలు, సంగీత దర్శకులందరూ నచ్చినవారే! ఈనాటి సినీ సాహిత్యంలో వెన్నెలలు కురిపిస్తున్న సీతారామశాస్త్రి అంటే ప్రత్యేకమైన అభిమానం.

విశ్వనాథ, యద్దనపూడి, యండమూరి నవలలంటే ఇష్టమున్నా తిమ్మన వారి "పారిజాతాపహరణం", పింగళి సూరన వారి "రాఘవపాండవీయం" లాంటి ప్రాచీన కావ్యాలంటే మక్కువ ఎక్కువ. బాణభట్టుని "కాదంబరి" , Ayn Rand's "Atlas Shrugged" అత్యంత ఇష్టమైన పుస్తకాలు.

ChimataMusic.com లో పాటలు వింటూ, DBలో చురుగ్గా పాల్గొనడం తన దినచర్యలో అతిముఖ్య భాగమై పోయిందంటున్న నందకిశోర్ గారు డిబిలో సినీ లోకానికి చెందిన ఆసక్తికరమైన విషయాలను తెలియబరచడం/తెలుసుకోవటంలో ఎంతో ఆసక్తిని కనబరుస్తారు.

